ఉద్యమకారుల హక్కులు అమలు చేయాలి: విమలక్క

విశ్వంభర, బాగ్ లింగంపల్లి : తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (టీయూఎఫ్-టఫ్) ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఉద్యమకారిణి విమలక్క అన్నారు. హైదరాబాదు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం టీయూఎఫ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో వివిధ రూపాల్లో పాల్గొన్న వారందరినీ ఉద్యమకారులుగా గుర్తించాలని, అమరుల కుటుంబాలకు ప్రకటించిన హామీలను అమలు చేయాలని, ఉద్యమకారులపై నమోదైన కేసులను బేషరతుగా ఉపసంహరించాలని, గుర్తింపు కార్డులు, పెన్షన్, సంక్షేమ పథకాలు కల్పించాలని విమలక్క డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రంథాలయాల చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ చరిత్రను, ఉద్యమకారుల త్యాగాలను భావితరాలకు అందించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యమానికి సంబంధించిన చరిత్ర, సాహిత్యం, పత్రాలను భద్రపరిచే శాశ్వత గ్రంథాలయాలు, స్మృతి కేంద్రాలు ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమ వారసత్వాన్ని పరిరక్షించాలని కోరారు.మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, ఉద్యమ సంస్థలు సమర్పించే జాబితాలు, నివేదికలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నియమించిన కమిటీకి చట్టబద్ధత కల్పించాలని కోరారు. సమావేశంలో ఉద్యమకారుల గుర్తింపు, అమరుల కుటుంబాలకు ప్రత్యేక ప్యాకేజీ, ఉద్యమ కేసుల ఉపసంహరణ, తెలంగాణ ఉద్యమ సీనియర్ల సంక్షేమ చట్టం, రూ.1000 కోట్లతో తెలంగాణ సంక్షేమ నిధి, సంక్షేమ కమిషన్ ఏర్పాటు, ప్రతి జిల్లాలో అమరవీరుల స్మృతి కేంద్రాలు, తెలంగాణ సాంస్కృతిక విశ్వవిద్యాలయం స్థాపన, ఉద్యమ చరిత్ర పరిరక్షణ, స్థానిక సంస్థలు, కార్పొరేషన్లలో ఉద్యమకారులకు ప్రాధాన్యం కల్పించడం తదితర తీర్మానాలను ఆమోదించారు. అలాగే ఉద్యమకారుల జాబితాతో కూడిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో టి. హనుమాన్లు, గాలి వినోద్ కుమార్, సినీ దర్శకుడు రఫీ, సోగారా బేగం, కట్ట భగవంత్ రెడ్డి, నాగిరెడ్డి, సదానందం, మల్సూర్, రమేష్ పోతుల, సంతోష్, వెలుగు వనిత, అనిత, వివిధ జిల్లాల ఉద్యమ నాయకులు, సుమారు 200 మంది ఉద్యమకారులు పాల్గొన్నారు.

నేడు సాధనా దీక్ష గోడపత్రిక ఆవిష్కరణ

విశ్వంభర, హైదరాబాద్ : వైశ్య కార్పొరేషన్ నిధులకై వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 3వ తేదీన ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) నిర్వహించే సాధనా దీక్ష గోడపత్రిక ఆవిష్కరణ గురువారం 30వ తేదీన బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కాచం సత్యనారాయణ గుప్త తెలిపారు.

గురుపౌర్ణమి వేడుకల్లో సిపి సుమతి

విశ్వంభర, గడ్డి అన్నారం : దక్షిణ షిరిడిగా ప్రసిద్ధి గాంచిన హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగాయి. గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.సాయినాథుడికి ప్రత్యేక అలంకరణలు, మహాభిషేకం, హారతులు,వేదమంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంతో పాటు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శిరిడీ సాయిబాబా దేవాలయాన్ని సందర్శించారు. దేవాలయంలో జరుగుతున్న గురుపూజోత్సవం సందర్భంగా భక్తులకు కల్పించిన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు, క్యూ లైన్లు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను కమిషనర్ గారు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, భద్రతా పరంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉచిత అల్పాహార వితరణ

విశ్వంభర, నల్గొండ : 26 మంది ఆర్యవైశ్య మహిళలు కలిసి వామన్ పారాయణం కిట్టీ పేరుతో ఒక సేవా వేదికను ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి పౌర్ణమి రోజున నిరుపేదలు, అవసరమైన వారికి ఉచిత అల్పాహార వితరణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని 48వ వార్డు కార్పొరేటర్ యామా కవితా దయాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వామన్ పారాయణం కిట్టీ సభ్యులు మాట్లాడుతూ.., తమ సేవా కార్యక్రమానికి ప్రోత్సాహం అందించి ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసిన కవితా దయాకర్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవే తమ ప్రధాన ధ్యేయమని, ప్రతి పౌర్ణమి రోజున ఉచిత అల్పాహార వితరణ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించడంతో పాటు, భవిష్యత్తులో మరిన్ని సేవా, దాతృత్వ కార్యక్రమాలను చేపట్టి సమాజంలోని అవసరమైన వారికి అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్ళపల్లి శిరీష, సోమవరపు శమంత, ఇడుకుళ్ళ కవిత, కాసం శోభ, జగిని శ్రీదేవి, వనమా శ్రావణి, పంపాటి జ్యోతి, వనమా శ్రీదేవి, చందా లక్ష్మి, తాళ్ళూరి లక్ష్మి, పొట్టుముత్తు మల్లిక, వందనపు జ్యోతి, వనమా శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేబీస్ రహిత హైదరాబాదే సిటిజన్స్ ఫర్ యానిమల్స్ లక్ష్యం

రామంతాపూర్‌లో ఉచిత రేబీస్ టీకా శిబిరం

విశ్వంభర, రామంతాపూర్ : రేబీస్ నిర్మూలనకు వీధి కుక్కలకు టీకాలు వేయడం అత్యంత ప్రభావవంతమైన మార్గం. ప్రజల సహకారంతో రేబీస్ రహిత హైదరాబాదే మా లక్ష్యమని సిటిజన్స్ ఫర్ యానిమల్స్ ప్రతినిధులు తెలిపారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో హైదరాబాదు రామంతాపూర్‌లో ఉచిత యాంటీ రేబీస్ టీకా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 50కుపైగా పెంపుడు, వీధి కుక్కలు, పిల్లులకు రేబీస్ టీకాలు వేశారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకు నగరంలో 3 వేల కుక్కలకు రేబీస్ టీకాలు వేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో పీపుల్ ఫర్ యానిమల్స్, హ్యూమేన్ వరల్డ్ ఫర్ యానిమల్స్, మధురోహా పెట్ కేర్, మిషన్ రేబీస్ ఇండియా, డబ్ల్యూవీఎస్ ఇండియా సంస్థల ప్రతినిధులు, పశువైద్య నిపుణులు, వాలంటిర్లు పాల్గొన్నారు.

శత్రువైనా సరే.. ఓటు మిస్సవ్వొద్దు!

సంగారెడ్డి కాంగ్రెస్ బీఎల్ ఏల సమీక్షా సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

విశ్వంభర, సంగారెడ్డి : "మన శత్రువు అయినా సరే.. ఓటు హక్కు మిస్ అవుతుందంటే ఆ ఓటును తప్పనిసరిగా నమోదు చేయించాల్సిందే" అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డి పట్టణంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డితో కలిసి నిర్వహించిన కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఓటు హక్కును కోల్పోతే భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని ఆందోళన వ్యక్తం చేశారు. "ఈ ప్రక్రియ కేవలం రాజకీయం కోసమో, ఓట్ల కోసమో కాదు.. ప్రజల హక్కులను కాపాడటానికే ఓటర్ల సవరణ ప్రక్రియకు తోడ్పడాలని రాహుల్ గాంధీ దిశానిర్దేశం చేశారు" అని గుర్తుచేశారు. ప్రజలు మనకు ఓట్లు వేస్తారా లేదా అనే ఆలోచన పక్కన బెట్టి ప్రతీ ఒక్కరి ఓటు నమోదుకు బీఎల్ ఏలు సహకరించాలని కోరారు.దేశంలో కేంద్ర ఎన్నికల సంఘం మోదీ నేతృత్వంలో పనిచేస్తోందని జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. బీజేపీ పన్నుతున్న కుట్రలు ఎటు నుంచి ఎటు పోతాయో ఊహించడం కష్టమని, నాయకులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బోనాల పండుగ ఉందనే నెపంతో ఈ ఓటర్ల నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు.గడిచిన నెల రోజులుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అహోరాత్రులు కష్టపడుతున్నారని ప్రశంసించారు. ఇప్పటి వరకు నిర్వహిస్తున్న సమీక్షలకు ప్రతీ బీఎల్ ఏ హాజరు కావడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో మన ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌లు నిరంతరం జూమ్ సమావేశాల ద్వారా SIR ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే రాబోయే ఆగస్టు 2న మరో కీలక సమావేశం ఉంటుందని వెల్లడించారు.

గురు పౌర్ణమి సందర్భంగా ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ బాలాజీ నగర్ కాలనీ లోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరం నందు జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కటిక రెడ్డి అరవింద రెడ్డి, దేవాలయం చైర్మన్ ముడుపు జయ యాదగిరి రెడ్డి ,ముడుపు సందీప్ రెడ్డి పలువురు నాయకులు,సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

(విశ్వంభర, వనస్థలిపురం)

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

విశ్వంభర, చైతన్యపురి : గురుపూర్ణిమ సందర్భంగా చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీలోని సాయిబాబా దేవాలయంలో తోట మహేష్ యాదవ్ స్వామివారిని దర్శించుకుని, వారి దివ్య ఆశీర్వాదాలను పొందడం జరిగింది. "గురువు చూపిన మార్గమే జీవితానికి వెలుగు... దైవ ఆశీస్సులే మన ప్రయాణానికి బలం." ఆలయ కమిటీ వారు శ్రీనివాస్ నాయుడు కమిటీ సభ్యులు తోట మహేష్ యాదవ్ ని శాలువా తో సత్కరించారు.సాయిబాబా వారి అనుగ్రహంతో ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో శ్రీశైలం యాదవ్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, నర్సింహ రెడ్డి ,రాజేష్, బాలు, గణేశ్, కాలని వాసులు పాల్గొన్నారు.

గురుపౌర్ణిమ - గురువందన కార్యక్రమం

విశ్వంభర, హైదరాబాద్ : పవిత్రమైన గురు పౌర్ణిమ, చాతుర్మాస దీక్షా ప్రారంభం సందర్భంగా హైదరాబాద్, బేగంపేటలోని శ్రీ పుష్పగిరి పీఠంలో పరమపూజ్య స్వామివారిని కలిసి గురువందనం సమర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్రరావుతో కలిసి భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ సెల్ కన్వీనర్ అన్నావజుల సూర్యప్రకాశ్ గారు, కోకన్వీనర్ నిరంజన్ దేశాయ్ గారు, జాయింట్ కన్వీనర్ మణిదీప్ గారు, కప్పర ప్రసాద్ గారు, సారంగుల అమర్‌నాథ్ పార్టీ జనరల్ సెక్రటరీ గౌతమ్ పాల్గొని స్వామివారికి గురువందనం సమర్పించారు.చాతుర్మాస దీక్షను ప్రారంభించిన ఈ శుభ సందర్భంలో స్వామివారు భారతీయ జనతా పార్టీ నాయకులకు, ఎండోమెంట్ సెల్ సభ్యులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి, దేశ ధర్మ పరిరక్షణతో పాటు భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ ప్రచారానికి నిరంతరం కృషి చేయాలని ఆశీర్వదించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 150 మంది ప్రముఖ సాధువులు, సంతులు, యోగులు, ఆధ్యాత్మికవేత్తలు, యోగా గురువులు, వైద్యులు, వివిధ రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖులను ఘనంగా సన్మానించడం జరిగింది.భారతీయ సంస్కృతి, గురుశిష్య పరంపర వైభవాన్ని సమాజానికి చాటిచెప్పే ఈ గురుపౌర్ణిమ - గురువందన కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ సెల్ విజయవంతంగా నిర్వహించడం ఎంతో ఆనందదాయకం.

డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేద్దాం.. యువతను కాపాడుదాం : ఎస్పీ సీతారామ్

విశ్వంభర, సికింద్రాబాద్ : యువత మాదకద్రవ్యాలు, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉంటేనే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఎస్పీ సీతారామ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బుధవారం కిమ్స్ హాస్పిటల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో డ్రగ్స్, మద్యం తదితర వ్యసనాల దుష్ప్రభావాల పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ సీతారామ్ మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావం, చెడు స్నేహాల కారణంగా కొందరు యువత చిన్న వయసులోనే మాదకద్రవ్యాలు, మద్యానికి బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యసనాలు వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, సమాజం, భవిష్యత్తు పై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన పై నిరంతరం నిఘా ఉంచి, మంచి విలువలు అలవర్చాలని సూచించారు. అనంతరం హైకోర్టు న్యాయవాది బి.కవిత యాదవ్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు యువత జీవితాలను నాశనం చేస్తున్నాయని, విద్యార్థి దశ నుంచే బాధ్యతాయుతంగా మెలగాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. కిమ్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా. మణిమాల రావు మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును మాదకద్రవ్యాలకు పనంగా పెట్టవద్దని, ఉజ్వల భవిష్యత్తుకు విద్యే మార్గమని అన్నారు. చెడు స్నేహాలతో మద్యం, ధూమపానం, డ్రగ్స్ వంటి వ్యసనాలకు అలవాటు కాకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఈ సందర్భంగా నగరంలో నమోదవుతున్న మాదకద్రవ్యాల కేసులు, వాటి నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అవగాహన, చికిత్స, పునరావాసం, సమాజ భాగస్వామ్యంతో వ్యసన రహిత భారతదేశ నిర్మాణమే నషా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెఈఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రిన్సిపల్స్ డా. ఐ. వేంకటేశ్వర్లు, డా. ప్రసూన, ప్రో. రెడ్డి రాణి, హెన్నా, సునీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డిని క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆయనకు పుట్టినరోజు కానుకగా సన్మాన పత్రం అందించిన 23వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి వల్దాస్ స్పందన కిరణ్, ఈ కార్యక్రమంలో సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, సూర్యాపేట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, 23వ వార్డు అధ్యక్షుడు ఏర్పుల కిరీటి, సీనియర్ నాయకులు వల్దాస్ ఉపేందర్, వీర్జల వేణు బలరాం తదితరులున్నారు.

- విశ్వంభర, సూర్యాపేట

ఎరువుల దందా పై ఉక్కుపాదం

విశ్వంభర, తొగుట : రైతులను దోచుకునే ఎరువుల అక్రమ వ్యాపారుల పై కఠిన చర్యలు తప్పవని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. డీఏపీ ఎరువుల అసలు ధర రూ.1,350 ఉండగా కొందరు వ్యాపారులు రూ.2 వేల వరకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదుల పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, వెంటనే విచారణ జరిపి కేసులు నమోదు చేయాలని ప్రత్యేకాధికారి, దుబ్బాక ఏడీఏ మల్లయ్యను ఆదేశించారు. తొగుట ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్ లు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన మండల అభివృద్ధి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పలు కీలక సూచనలు చేశారు. పామాయిల్, ఉద్యాన వన పంటలు, పట్టు పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు సన్నధాన్యం సాగు, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. బీవీజీ రామ్‌జీ పథకం ద్వారా గోదాములు, గ్రామ పంచాయతీ భవనాలు, పీహెచ్‌సీ సబ్‌సెంటర్లు, ప్రహరీ గోడలు, మురుగు కాలువలు, ఫార్మేషన్ రోడ్లు, ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యల పై అధికారులు గ్రామాల వారీగా పర్యటించి సర్వంచులతో కలిసి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వైర్ల వివరాలను సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి వృథాను అరికట్టి ప్రతి గ్రామంలో తాగునీటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల నమోదును పెంచాలని కోరారు. వర్షాకాలంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. మల్లన్నసాగర్ నిర్మాణం సమయంలో భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని, రోడ్ల నిర్మాణం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేకాధికారి మల్లయ్య, సీఐ లతీఫ్, ఎస్ఐ నవీన్, ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణా రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి, ఎంపీడీఓ నర్సింహా రెడ్డిలతో పాటు సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్పిడి కోసం దరఖాస్తు నోటీసు

(ఫారం URC-2 – కంపెనీల (రిజిస్టర్ చేయడానికి అధికారం) నియమాలు, 2014)

భాగస్వామ్య సంస్థ పేరు: SSJ IT CONSULTANCE (ఎస్.ఎస్.జె ఐటి కన్సల్టెన్స్)
ప్రతిపాదిత ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరు:[ROCకి దరఖాస్తు చేసిన ప్రతిపాదిత పేరు]: PSIJAN INFOTECH PRIVATE LIMITED (సైజన్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్)
సంస్థ యొక్క నమోదిత కార్యాలయ చిరునామా: ఇంటి నెం: 6-94/3, వి. జి. కాలని, వీధి-2, మేడిపల్లి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, తెలంగాణ-500098
ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా.. పైన పేర్కొన్న భాగస్వామ్య సంస్థ, కంపెనీల చట్టం 2013లోని భాగం I మరియు కంపెనీల (రిజిస్టర్ చేయడానికి అధికారం) నియమాలు, 2014 ప్రకారం, [రాష్ట్రం పేరు] రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వద్ద ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్పిడికి దరఖాస్తు చేసుకోవడానికి ఉద్దేశించింది.
ప్రతిపాదిత మార్పిడికి ఏదైనా అభ్యంతరం ఉన్న వ్యక్తి, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 21 రోజుల లోపు, [రాష్ట్రం పేరు] రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్కు వ్రాతపూర్వకంగా తమ అభ్యంతరాన్ని సమర్పించవచ్చు. దీని ప్రతిని దిగువ సంతకందారునికి కూడా పంపించాలి.

తేదీ: [29/07/2026]
ప్రదేశం: హైదరాబాద్
భాగస్వాముల ఆదేశానుసారం
/-
సంతకం:
పేరు: ఇరుసవడ్ల జనార్ధన్
(భాగస్వామి / అధీకృత ప్రతినిధి)

రిపోర్టర్లు కావలెను

V3 NEWS
ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108